ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్

మంగళవారం 11 నవంబరు 2025

5



క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్




కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన గాదె రుక్మారెడ్డి విద్యార్థులకు షీల్డును బహూకరిస్తున్న టాస్ సీఐ మహేందర్‌రెడ్డి

8

ముక్కోటి గొంతుకలు శోకతప్తం



హనుమకొండలోని జిల్లా కోర్టులో అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



పాటతో పోటెత్తి, ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన అందెశ్రీ అస్తమయం

- ఆకస్మిక మరణంతో విషాదంలో తెలంగాణ సాహిత్య లోకం
- పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మద్దూరులో జన్మించిన అందెశ్రీ
- తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లుతో మమేకం
- 'ధూం..ధాం..' సభల్లో తనదైన ముద్ర
- గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన కేయూ
- సంతాపం తెలిపిన భిన్నరంగాల ప్రముఖులు

హనుమకొండ/హనుమకొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాహిత్య శిఖరం అందెశ్రీ అనంత తీరాలకు తరలివెళ్లడంతో ఓరుగల్లులో విషాదం నెలకొంది. 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' అంటూ తెలంగాణను వేనోళ్ల పొగిడిన ప్రజా వాగ్గేయకారుడు కన్నుమూయడంతో అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. రచయితగా, కళాకారుడుగా చెరగని ముద్రవేసిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో సాహితీ ప్రపంచం ఒక్కసారి దిగ్భ్రాంతికి లోనైంది. అందెశ్రీ హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అందెశ్రీ అనేది కలంపేరు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18న జన్మించారు. అందెశ్రీకి వరంగల్‌తో విడదీయరాని అనుబంధం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అందెశ్రీ తన మాటలు, పాటలతో జనాన్ని ఎంతగానో కదిలించారు. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పారు. 'ధూం ధాం' కార్యక్రమ రూపశిల్పిగా తెలంగాణలోని 10 జిల్లాల్లోని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాట ప్రభంజనం సృష్టించింది. పల్లె నీకు వందనాలమ్మో, మాయమై పోతున్నడమ్మో మనిషన్న వాడు, గలగల గజ్జెల బండి, కొమ్మ చెక్కితే బొమ్మరా, జన జాతరలో మన గీతం, యెల్లిపోతున్నావా తల్లి... అందెశ్రీ రాసిన (మిగతా 7వ పేజీలో)

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- ధాన్యాన్ని వెంటనే తరలించాలి
- వీసీలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగాధాన్యం, పత్తి, సోయా తదితర పంటల కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి సోమవారం అన్నిజిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల, సహకార శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి వెంటనే ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, వాతావరణ పరిస్థితులను రైతులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉంచాలని, కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్స్, మాచర్ మిషన్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. పూర్తి స్థాయిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేయాలన్నారు. ఈ వీసీలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మానుకోట నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, మధుసూదనరాజు, విజయనిర్మల, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, జైపాల్ రెడ్డి, దేశీరాం, విజయ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలి

డీసీఈబీ సెక్రటరీ బాలాజీ



మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలను పరిశీలిస్తున్న డీసీఈబీ సెక్రటరీ బాలాజీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో రాణించి మానుకోట జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలని డీసీఈబీ సెక్రటరీ వి.బాలాజీ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం టీ-సాట్ జిల్లా స్థాయి క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా, వివిధ పోటీల్లో పాల్గొని రాణించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని పేర్కొన్నారు. డీఎస్వో అప్పారావు మాట్లాడుతూ... టీ-సాట్ ద్వారా విద్యార్థులకు అనేక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిరినాయక్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, గంగాధర్, ముణి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



దంతాలపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఉన్న లారీ

8



కురవి వీరభద్రస్వామి గదుల వేలాన్ని నిర్వహిస్తున్న ఈవో సత్యనారాయణ

వీరభద్రస్వామి ఆలయ గదుల వేలం

- రికార్డు స్థాయిలో పెరిగిన అద్దెల ధర
- పోటీ పడి దక్కించుకున్న వ్యాపారులు
- తూర్పు రాజగోపురం గదికి నెలకు రూ.2.25 లక్షలు

కురవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కురవిలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయానికి సంబంధించిన గదుల కిరాయి వేలం రికార్డు ధరలు పలికాయి. ఆలయం పరిధిలోని గదుల నిర్వహణకు ఆలయ అధికారులు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. వ్యాపారులు పోటీ పడి గదులను దక్కించుకునేందుకు అధిక ధరలకు వేలం పాడారు. ఆయా గదులను దక్కించుకున్న వ్యాపారులు అద్దెను నెల నెలా చెల్లిస్తారు. తూర్పు రాజగోపురం పక్కన ఉన్న చిన్న గదికి నెలకు గత సంవత్సరం రూ.85వేలు వేలం పాడితే.. ఈ సంవత్సరం రూ.2.25 లక్షలకు రికార్డు వేలం పాడారు. బుక్క శంకర్‌రావు అనే వ్యక్తి ఈ వేలం ద్వారా ఆ గదిని దక్కించుకున్నారు. 7వ నంబర్ రూమ్‌కు గత సంవత్సరం రూ.4,100 ఉండగా ఈ సంవత్సరం రూ.75,200లకు పెరిగింది. రూమ్ నంబర్ 18కి గత సంవత్సరం రూ.40వేల కిరాయి ఉండగా, ఈ సంవత్సరం రూ.77,100లకు పెరిగింది. రూమ్ నంబర్ 19కి గత సంవత్సరం రూ.13వేలు ఉండగా ఈసారి రూ.80,200లకు చేరింది. రూమ్ నంబర్ 20కి గత సంవత్సరం రూ.9,100 ఉండగా.. ఈ సంవత్సరం రూ.70వేలకు పెరిగింది. రూమ్ నెంబర్ 24కు గత సంవత్సరం రూ.7,600 ఉండగా ఈ సంవత్సరం రూ.35వేలకు పెరిగింది. సోమవారం రాత్రి పొద్దుపోయేంత వరకు వేలం జరుగుతూనే ఉంది. ఇంకా సగం గదుల వేలం పూర్తికావాల్సి ఉంది. మొత్తంమీద ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. ఈ వేలంలో ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఆర్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పోలింగ్‌పై మానుకోటలో ఉత్కంఠ

- గెలుపు మాదే అంటూ ఇరుపక్షాల బెట్టింగ్స్
- లోకల్‌బాడీ ఎలక్షన్స్‌కు ఇదే రెఫరెండమ్



మహబూబాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి: దాదాపు దశాబ్ద కాలం తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సరిగ్గా రెండేళ్ల చివరిలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బలం చాటుకునే దిశగా తలపడడం... ఈ ఎన్నికల ద్వారానే కాంగ్రెస్ బలహీన పడిందని ప్రజలకు సంకేతం పంపేందుకు విపక్ష బీఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డడం... మహబూబాబాద్ జిల్లా రాజకీయాల్లో ఉత్కంఠత రేపుతోంది. ఈ ఎన్నికలకు దాదాపు వారానికి పైగా అక్కడే ప్రచారంలో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీలు, నాయకులు జూబ్లీహిల్స్ ఫలితాలే రేపటి లోకల్‌బాడీ ఎలక్షన్స్‌కు రెఫరెండమ్‌గా మారుతాయంటూ సవాల్‌కు ప్రతి సవాల్ విసురుకుంటూ తమ అనుచరులను, అనుయాయుల మధ్య చర్చోపచర్చలకు పురమాయిస్తున్నారు. ఈనెల 11న ఎన్నికల పోలింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ప్రచారం నిర్వహించి వచ్చిన మానుకోట జిల్లా నాయకులతో పాటు రాజకీయ పరిశీలకులు గెలుపు మాదేనంటే.. తమకే ఉంటుందంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నారు.

మానుకోట నేతల ప్రచారం..

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి మహబూబాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నేతలు పెద్దఎత్తునే తరలివెళ్లారు. వారం, పది రోజులుగా అక్కడే క్యాంప్ వేసి నిత్యం తమ అభ్యర్థుల తరుపున విజయం కోసం ప్రచారం చేపట్టారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ మంత్రి ధనసరి సీతక్క, పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, డోర్నకల్ ప్రాతినిధ్య ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అర్బన్ యూత్ ప్రెసిడెంట్ యాళ్ల మురళీధర్‌రెడ్డి, బీజేపీకి చెందిన మాజీ జిల్లా అధ్యక్షులు యాప సీతయ్య, వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు అక్కడే మకాం వేసి తమ తమ అభ్యర్థుల తరుపున ప్రచారంలో ఊదరగొట్టారు. ఈ వీడియోలు, పోస్టులను మహబూబాబాద్ పొలిటికల్ సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తూ ఇక్కడే ఎన్నికలు జరిగాయా.. అన్న రీతిలో పార్టీ శ్రేణుల్లో చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై ఆగిన క్రమంలో డీలా పడ్డ స్థానిక నాయకత్వంలో జోష్ నింపేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు.

జయాపజయాలపై బెట్టింగ్స్..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పోలీసులు పలువురు నేతల ఇళ్లపై దాడులు చేసిన క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు (మిగతా 8వ పేజీలో)

పది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు
- రూ.1.20 లక్షల సరుకు, రెండు బైక్‌లు సీజ్

కేసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం మహమూద్‌పట్నం తౌర్యతండా శివారు ముత్యాలమ్మతండా సమీపంలో సోమవారం సుమారు రూ.1.20 లక్షల విలువైన పది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎస్ఐ కె.కాంత్రికిరణ్ తెలిపారు. ముత్యాలమ్మ తండాకు చెందిన మాలోత్ అశోక్, చంద్రుతండాకు చెందిన గుగులోత్ సురేష్‌లు తండా సమీపంలో ఒకచోట 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 40 లీటర్ల నాటుసారా నిల్వ ఉంచారు. వీటిని కొద్దికొద్దిగా రెండు మోటార్ సైకిళ్లపై విక్రయించేందుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు వీరు పట్టుబడగా నిల్వ చేసిన సరుకు విషయం బయటపడింది. దీంతో రెండు మోటార్ సైకిళ్లు, సరుకును సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు



ఉప్పరగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం ఎండీ పాషా

పెద్దవంగర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను విక్రయించాలని ఏపీఎం ఎండీ పాషా, మండల వ్యవసాయాధికారి గుగులోతు స్వామినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కొరిపెల్లి, ఉప్పరగూడెం, బొమ్మకల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. దళారులు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులు ఇస్తామని చెప్పే మాయ మాటలకు రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీసీలు సుజాత, ఉమ, ఆపరేటర్ అనిల్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

రేపోని శివారులో ఇసుక ట్రాక్టర్లు సీజ్?

దంతాలపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపోని శివారు పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పలు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిసింది. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌చేసి తహసీల్దార్‌కు నివేదిక అందించినట్లు తెలిసింది.

రామాలయంలో అయ్యప్పస్వామి పడి పూజ

మరిపెడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరిపెడ బంగ్లాలోని రామాలయంలో ఆ ఆలయ నిర్వాహకులు సోమవారం అయ్యప్పస్వామి పడి పూజ, హోమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ స్వాములు భజనలు, సంకీర్తనలతో అయ్యప్ప నామస్మరణను హోరెత్తించారు. అర్చకులు సుదర్శన్ భట్టార్ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీచేశారు. స్వాములకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గంట్లా రంగారెడ్డి, వుప్పల నాగేశ్వర్‌రావు, గర్రెపల్లి కాంతారావు, దిలీప్, శ్రీనివాస్‌రావు, రూప్లా, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో - బేటీ పడావో పోస్టర్ల ఆవిష్కరణ



బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల స్కూళ్లో సోమవారం జిల్లా మహిళా సాధికారిత కోఆర్డీనేటర్ మహేశ్వరి స్థానిక అధికారులతో కలిసి బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలికాల అక్రమ రవాణాపై విద్యార్థినులకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ స్కూల్ ఎస్‌వో లలిత, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, సందీప్, శ్రీకాంత్, నాగమల్లు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



దివ్య (ఫైల్)

వెంకటాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మండలం సింగరకుంటపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు పెట్రోల్‌బంకులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అటికె పరమేష్ తన భార్య దివ్య(25)తో కలిసి సింగరకుంటపల్లిలో నివాసముంటున్నారు. వారికి కుమారుడు సాయిసిద్ధాంత్, కుమార్తె సాయిమహన్వి ఉన్నారు. అయితే పిల్లలకు హోంవర్క్ చేయించలేదని పరమేష్ దివ్యను మందలించాడు. అంతేగాకుండా ఆన్‌లైన్‌లో రూ.30వేల షాపింగ్ చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దివ్య ఆదివారం సాయంత్రం ఎలుకలమందు సేవించింది. పరమేష్ వెంటనే ఆమెను ములుగు ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆమె తండ్రి భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చల్ల రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్న ఎంపీవో

- 'ప్రజావాణి'లో పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదు
- చర్చనీయాంశమైన అవినీతి ఆరోపణలు

బచ్చన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) వెంకట మల్లిఖార్జున్‌పై మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చేసిన ఆరోపణలు చర్చనీయాంశమైంది. దీనికి తోడు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం తమను వేధిస్తున్నాడని, ప్రతీనెల మామూళ్ల ముట్టజెప్ప కుంటే కక్ష సాధిస్తున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. జీపీల సందర్శనకు వచ్చినప్పుడు తన కారు పెట్రోల్ ఖర్చులను తమనే భరించమనే వారని, ఫోన్‌పే నుంచి ఎంపీవోకు, ఆయన డ్రైవర్‌కు అమౌంట్ సెండ్ చేసిన స్క్రీన్ షాట్‌లను ఫిర్యాదుతో జతపర్చారు. కార్యదర్శులు సెలవుఅడిగితే ఆ రోజుకు సంబంధించిన వేతనం తనకు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేశారంటూ తెలిపారు. కాగా, ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇన్‌చార్జీ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్ : గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులు పెడుతున్న ఎంపీవో, ఇన్‌చార్జీ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని బచ్చన్నపేట మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ధారవత్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ఇన్‌చార్జీ ఎంపీడీవో వెంకట మల్లిఖార్జున్ కార్యదర్శులను మానసికంగా హింసిస్తూ నెలకు ఒక్కొక్క కార్యదర్శి నుంచి రూ.3,000 వసూల్ చేస్తున్నారని, సెలవు మంజూరు కోసం సెలవుకు సంబంధించిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూన్నారని ఆరోపించారు.

ప్రభుత్వం స్పందించి విచారణ చేసి ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు అనిల్ రాజు, భాస్కర్, కరుణాకర్, రమేశ్, శ్రీనివాస్, సతీశ్ రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ డ్రైవర్‌లకు కౌన్సిలింగ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై ఉపేందర్

తొర్రూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని తొర్రూరు ఎస్సై ఉపేందర్ అన్నారు. సోమవారం పట్టణ శివారులో గ్రానైట్ లారీ డ్రైవర్‌లకు, వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ లారీ డ్రైవర్‌లు అధిక బరువుతో వాహనాలు నడపవద్దని, స్పీడ్‌ను నియంత్రించి నెమ్మదిగా వెళ్లాలని, తగినంత విశ్రాంతి తీసుకునే వాహనాలు నడపాలని సూచించారు. గ్రానైట్ లారీలు అనుమతి పత్రాలు, రవాణా చలాన్‌లు అన్ని సక్రమంగా ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరుగుత ఎన్నాయని, నిబంధనలు పాటించని డ్రైవర్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజు, పరమేష్, బాప్‌సింగ్, మధు, తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీ 20ఆర్ ఉప కాలువ పరిశీలన

మరిపెడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ డీబీఎం 60 ప్రధాన కాలువకు ఉప కాలువైనా 20ఆర్‌ను సోమవారం ఇరిగేషన్ ఇంజినీర్లు పరిశీలించారు. మండలంలోని బాబోజిగూడెం, గుండెపూడి, వెంకంపాడు, తానంచర్ల, బుర్హాన్‌పురం రైతులకు ఉపయోగపడే ఈ కాలువ నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు రావట్లేదని ఆయా గ్రామాల రైతుల ఫిర్యాదు మేరకు ఎస్సారెస్పీ ఇరిగేషన్ విభాగపు ఇంజినీర్లు పరిశీలించి అడ్డంకులు తొలిగించేందుకు తగినా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు ఎస్ఈ రాధకృష్ణ రైతులకు వివరించారు. ఆయన వెంట ఈఈ సల్మాన్‌రాజు, డీఈఈ సంజీవ, ఏఈ నరేందర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ 20ఆర్ ఉప కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఇంజినీర్లు

సామాజిక సేవతోనే ఎదుగుదల



ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రమౌళి

తొర్రూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవతోనే పరిపూర్ణమైన పౌరులుగా ఎదుగుతారని హనుమండల కొండల పింగిలి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అన్నారు. తొర్రూరు డిగ్రీ కళాశాల యూనిట్-1, యూనిట్-2 విభాగాల ఆధ్వర్యంలో మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడానికి ఎన్.ఎస్.ఎస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాములు, ప్రోగ్రాం ఫీసర్లు డాక్టర్ వాల్యానాయక్, డాక్టర్ సుజాత, వర్ధన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య, ఎంఈవో మహంకాళి బుచ్చయ్య, విశ్రాంతి హెచ్ఎంలు రంగారెడ్డి, డాక్టర్ శాంతికుమార్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం తనూజ, యాకూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రవాణా, దిగుమతిలో లేబర్ కొరత రాకుడా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయం నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ రామకృష్ణారావు, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి స్టీఫెన్ రవీంద్రలతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇంకా మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అత్యవసరంగా ప్రారంభించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. రవాణా, గోదాముల నిర్వహణ, కార్మికుల లభ్యతలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ధాన్యం, పత్తి, మొక్కజొన్న, తదితర పంటల కొనుగోలులో నవంబరు, డిసెంబరు ముఖ్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయా లన్నారు. మొంథా తుపాను ప్రభావంతో 1.10లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయారని, రైతులు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో వారికి అన్నివిధాలా అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులకు మ్యాపింగ్, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేసి క్లిష్టత లేకుండా సౌకర్యవంతం చేయాలని స్పష్టం చేశారు. సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ రైతు కష్టానికి ఫలితం వచ్చే సమయమని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా పంటలను కొనుగోలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, డీఆర్‌డీవో శ్రీనివా సరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి షాఫైజల్ హుస్సేనీ, డీఎం రాంపతి, జిల్లా సహకార అధికారి సర్ధార్‌సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన చోరీ కేసు

- 24గంటల్లో ఛేదించిన పస్రా పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు, రిమాండ్
- రూ.16లక్షల సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్

గోవిందరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో ఈనెల 8వతేదీ రాత్రి జరిగిన చోరీ కేసును పస్రా పోలీసులు 24గంటల్లో ఛేదించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రూ.16లక్షల సొత్తును రికవరీ చేశారు. ఈమేరకు సోమవారం ములుగులోని ఎస్డీపీవో కార్యాలయంలో డీఎస్పీ రవీందర్ పస్రా సీఐ దయాకర్, ఎస్సై కమలాకర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బుస్సాపూర్ గ్రామంలోని పుల్యాల రజిని ఇంట్లో ఈనెల 8వతేదీన రాత్రి చోరీ జరిగినట్లు బాధితురాలు పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. దీంతో సీఐ దయాకర్, ఎస్సై కమలాకర్‌లు సిబ్బంది, క్లూస్‌టీం సహకారంతో దర్యాప్తు చేపట్టారని, సమర్థవంతమైన విచారణ వల్ల నిందితులు దొంగిలించిన 12తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల10వేల నగదు మొత్తం రూ.16లక్షల10వేలను రికవరీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. బుస్సాపూర్ గ్రామానికి చెందిన కుక్కల రాజు, కండెల పద్మ, పెరుమాండ్ల భాగ్యలక్ష్మిలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ చోరీకి పాల్పడ్డారని తెలిపారు. వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. 24గంటల్లో చోరీ కేసును ఛేదించడం పట్ల పస్రా సీఐ,ఎస్సైలు, సీసీఎస్ సిబ్బంది, క్లూస్‌టీంను డీఎస్పీ రవీందర్ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సైలు సతీష్, ఆంజనేయులు, సీసీఎస్, క్లూస్‌టీం సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి



శివుడికి పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కార్తీక మాస సోమవారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఉదయం 4 గంటల నుండే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేసి అనంతరం తులసి చెట్టు వద్ద లక్ష దీపాలు అలంకరించారు. శ్రీ శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చీర సారె సమర్పించారు.



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాజబాబు స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వీవోఏపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

చిట్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఐకేపీ వీవోఏను తొలగించాలని సోమవారం గ్రీవెన్‌సెల్‌లో మహిళలు కలెక్టర్ రాహుల్‌శర్మకు పిర్యాధు చేశారు. స్థానిక ప్రగతి గ్రామైఖ్య సంఘానికి రుణాలు ఇప్పించకుండా వీవోఏ తమపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. వీవోఏ అతడి భార్యతో పాటు మరో ఇద్దరు మహిళా సంఘాల బాధ్యులపై పిర్యాధు చేసినట్లు తెలిపారు. పిర్యాధు చేసిన వారిలో మహిళ సంఘాల సభ్యులు శ్రీలత, బుర్ర కోమల, సాయి నిఖిత, రాధిక తదితరులు ఉన్నారు.

జోనల్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేటలో నిర్వహించిన 11వ జోనల్ స్థాయి గురుకుల క్రీడా పోటీల్లో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ సంక్షేమ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 6 నుంచి 8 వరకు జరిగిన పోటీల్లో 14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ టీమ్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ రఘుపతి, పీడీ జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో ఖోఖో, టెన్నికాయిట్‌లో ప్రథమ స్థానం, అండర్ 17విభాగంలో టెన్నికాయిట్ ప్రథమ, హ్యాండ్ బాల్, ఖోఖోలో ద్వితీయ స్థానం, అండర్ 19విభాగంలో చెస్, టెన్నికాయిట్ ప్రథమ, హ్యాండ్ బాల్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. అలాగే సీహెచ్ పవన్ అండర్ 19 విభాగం 100, 200, 400మీటర్ల పరుగులో ప్రథమ, ఎల్. చరణ్ 1500, 5000 మీటర్ల పరుగులో ద్వితీయ, 17ఏళ్ల విభాగంలో కె.విఘ్నేష్ 800, 1500 మీటర్ల పరుగులో ద్వితీయ, ఎం.మహేష్ 100, 200, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారు. అరవింద్ షాట్‌పుట్, డిస్కస్ త్రోలో ద్వితీయ, అండర్ 14విభాగంలో వెంకటదుర్గ 200, 400 మీటర్ల పరుగులో ద్వితీయ, భానుతేజ డిస్కస్‌త్రోలో ద్వితీయ, జీవన్ షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో సాధించి అథ్లెటిక్స్‌లో, టీమ్ గేమ్‌లో ఓవరాల్ ఛాంపియన్‌లుగా నిలిచారని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను క్రీడల సమన్వయ కర్త జి.శ్రీనివాస్, పీఈటీ లక్ష్మణ్, కోచ్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, జయేందర్, డాక్టర్ పవన్‌కుమార్, సైదులు, చారి, శంకరమ్మ అభినందించారు.

బాలవక్తలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని అర్పిత



అర్పిత

చిలుపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18 నుంచి హైదరాబాద్ రామంతాపూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలవక్త పోటీలకు జనగామ జిల్లా చిలుపూర్ మండలం పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని గొడుగు అర్పిత ఎంపికైనట్లు హెచ్‌ఎం యల్లంభట్ల విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన టీశాట్ నెట్‌వర్క్, టీఎస్ జీహెచ్‌ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో మాన్యువల్ స్టూడెంట్ కాంపిటీషన్-25 జిల్లా స్థాయి బాలవక్త పోటీల్లో పాల్గొన్న అర్పిత అత్యుత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థిని అర్పితను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో విద్యాశాఖ ఏసీజీ రవికుమార్, పీఈటీ దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

వివాహితపై కత్తితో దాడి..

నర్సింహులపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వివాహితపై ఓ వ్యక్తి కత్తితో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ములవంచలో ఓ మహిళతో అదే కాలనీకి చెందిన బి.రవి కొంతకాలం నుంచి చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆ మహిళ మరో వ్యక్తితో మాట్లాడుతున్న క్రమంలో అనుమానం వచ్చిన రవి కోపొద్రిక్తుడై కత్తితో దాడికి దిగాడు. ఈ ఘటనలో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సహకారంతో 108 ద్వార జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఎం.సురేశ్ ఘటన స్థలానికి చేరుకుని దాడికి గల కారణాలను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకుని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

కూలీలపై తేనెటీగల దాడి

వెంకటాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం లంకలకు వెళ్లే దారిలో మిర్చి కూలీలపై తేనెటీగలు సోమవారం దాడిచేశాయి. పాత్రాపురం గ్రామానికి చెందిన సుమారు 20మంది కూలీలు ఉదయం ఎచ్చిత్రాపురం లంకలోని మిర్చితోటలో కూలీ పనులకు బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యంలో ఎనిమిది మందిపై తేనెటీగలు పెద్ద మొత్తంలో దాడి చేశాయి. దీంతో గాయపడిన వారిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో భిక్షపతి అనే వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

లొంగిపోయిన మహిళా మావోయిస్టు



లొంగిపోయిన మావోయిస్టు సోమితో జిల్లా పోలీసులు

ములుగు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన మహిళా మావోయిస్టు మడవి సోమి సోమవారం లొంగిపోయిందని జిల్లా ఎస్పీ శబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సుక్మా జిల్లా, చత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందిన సోమి నిషేధిత మావోయిస్టు పార్టీ 2వ సీఆర్సీలో పీపీసీఎం హోదాలో పనిచేశారని పేర్కొన్నారు. జిల్లా పోలీసులు ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన పోరుకన్నా ఊరుమిన్న-మన ఊరికి తిరిగి రండి అనే అవగాహన కార్యక్రమం ప్రభావంతో మావోయిజాన్ని విడిచి పెట్టి ప్రశాంత జీవనం గడపాలని సోమి లొంగిపోయారని, జనవరి 2025 నుంచి ఇప్పటి వరకు 85 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు.

ఆంధ్ర టూ కాశి

సైకిల్ యాత్ర చేపట్టిన శివ భక్తులు



సైకిల్‌పై యాత్ర చేస్తున్న శివ భక్తులు

వాజేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని అందరికి తెలియజేయాలనే స్ఫూర్తితో నలుగురు శివ స్వాములు సైకిల్‌యాత్ర చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ అంబేద్కర్ జిల్లా మూలపాలెం నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాశికి సైకిల్‌పై యాత్రను కొనసాగిస్తున్నారు. శివ మాలధారణను ధరించిన కొక్కిలి గడ్డ సుబ్రమణ్యం, మేడ శ్రీను, రేకడి వీరబాబు, పిన పోతురాజులు రోజుకు సైకిల్ పై 70 కిలోమీటర్ల ప్రయాణిస్తున్నారు. వారం రోజుల క్రితం యాత్రను ప్రారంభించగా సోమవారం వాజేడు మండలంలోని జగన్నాధపురం జాతీయ రహదారి మీదుగా చత్తీస్‌గఢ్‌కు వెళుతున్నారు. అక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చేరుకుని కాశి విశ్వనాథుడిని దర్శించుకుంటామన్నారు. ఆలయాల్లో రాత్రిళ్లు నిద్ర చేస్తూ దాతలు భిక్షను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరూ హిందూ ధర్మం గురించి తెలుసుకోవాలని యాత్రికులు తెలిపారు.



జల్లెడలా జిల్లా..

- వరంగల్ జిల్లాలో విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకాలు
- నిబంధనలు పాటించని యజమానులు
- పట్టించుకోని అధికారులు
- అభాసుపాలవుతున్న వాల్టా చట్టం

మామునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో విచ్చలవిడిగా బోరుబావులు తవ్వుతున్నారు. భూమిని జల్లెడలా మార్చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి రోజుకు 100 నుంచి 130 బోర్లు వేస్తున్నారు. ఇంటింటికీ బోర్లు ఉన్నా రికార్డుల్లో మాత్రం 10 శాతం కుడా నమోదు కావడం లేదు. అనుమతి లేకుండా ఇష్టారీతిన బోర్ల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పంటపొలాలకు పరిమితమైన బోర్లు ఇప్పుడు ఇళ్లలో వేస్తున్నారు. బోర్లు తవ్వాలంటే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి. కాని ఈ నిబంధనను ఎవరూ పాటించడంలేదు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవనే మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు.



బోర్లకు డిజిటల్ మీటర్లు తప్పనిసరి..

పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, ఇతర పెద్ద ప్రాజెక్టులకు సంబంధించిన బోరుబావులకు విధిగా డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్లు ఉండాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఆ మీటర్లు భూగర్భ జలాల వాడకాన్ని లెక్కించడానికి సహాయపడతాయి. దీన్ని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ (సీజీడబ్ల్యూఏ) లేదా రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షించాలి.

పన్నులు వసూలు చేయడంలో విఫలం..

వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని బోర్లు ఉన్నాయో అధికారుల వద్ద లెక్కలు లేవు. 2023 జీవో ప్రకారం కమర్షియల్ బోర్లకు ప్రభుత్వం పన్ను విధించింది. ఈ ఏడాది 50 లక్షలు వసూలు చేయాలని టార్గెట్ విధించింది. కాని రూ.12 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ- నగర పరిధిలో మునిసిపల్ అధికారులు పన్నులు వసూలు చేయాలి. కాని కమర్షియల్ బోర్లు భూగర్భజలశాఖకు సంబంధించినవని చెప్పి పై రెండు శాఖల అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

పరిమితికి మించి వాడితే ఫీజులు కట్టాల్సిందే..

కమర్షియల్ బోరు బావులకు ప్రభుత్వం పన్ను విధించింది. పరిమితికి మించి నీటిని వాడితే ప్రాంతాన్ని బట్టి అదనంగా తోడే నీటికి ఫీజులు కట్టాల్సిందేనని జీవో జారీ చేసింది.

అధికారుల చర్యలు శూన్యం..

బోరు వేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. వాల్టాచట్టం ప్రకారం బోరుకు పర్మిషన్, ఇంకుడు గుంతలు, నిర్ణీత దూరం వంటి నిబంధనలు పాటించాలి. లేదంటే కఠిన చర్యలు ఉంటాయి. అవసరమైతే బోరుబావిని సీజ్ చేసే అధికారాన్ని వాల్టాచట్టం కల్పించింది. కాని అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నామమాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

శాఖల మధ్య సమన్వయం లేదు..

మేరు అశోక్, భూగర్భ జలశాఖ అధికారి



జిల్లా పరిధిలో ఇప్పటివరకు 116 కమర్షియల్ బోరుబావులకు మాత్రమే ఎన్‌వోసీలు ఇచ్చాం. ఇంకా ఐదు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా వారికి నోటీసులు ఇస్తే చాంబర్ ఆఫ్ కామర్స్ వారు అడ్డుపడుతున్నారు. ఇందులో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకనే టార్గెట్ రీచ్ కాలేకపోతున్నాం. దానికి తోడు సిబ్బంది తక్కువ ఉండటంతో ఫీల్డ్ వర్క్ నెమ్మదిగా కొనసాగుతోంది.



ఇంకా నిర్మాణం పూర్తి కాని ఆర్చి

కాళేశ్వరా.. మన్నించు..

- సరస్వతి పుష్కరాల పనులు ఇప్పటివరకు పూర్తికాని వైనం
- నిద్రావస్థలో ఎండోమెంట్ అధికారులు, కాంట్రాక్టర్లు
- పట్టించుకోని పాలకులు

మహదేవపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడి సన్నిధిగా పేరొంది.. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాళేశ్వరాలయానికి నిత్యం భక్తుల రాక పెద్ద ఎత్తున ఉంటుంది.. విజయవంతంగా సరస్వతి పుష్కరాలు సైతం ముగిశాయి. అతిశయోక్తి ఏమిటంటే సరస్వతి పుష్కరాలకు మొదలైన అబివృద్ధి పనులు ఇంతవరకు పూర్తికాకపోవడం విడ్డూరం. ఎండోమెంట్ ఆధ్వర్యం లో చేపట్టిన రూ.3 కోట్ల పనులు ఇంకా నత్త నడకన సాగుతూనే ఉన్నాయి. 2027 గోదావరి పుష్కరాల వరకైనా ఈ ప నులు పూర్తయ్యేనా అని ప లువురు విమర్శిస్తున్నారు. అన్ని ఉన్నా అల్లుడి నోట్ల శని ఉన్నట్లు నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉంది.

ఇంకా పూర్తి కాని ఆర్చి పనులు

పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి పనులు ఇంకా పూర్తి కాలేదు.. అంతేగాకుండా ఆర్చి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్ర రహదారికి అడ్డంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.40 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఆర్చి నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్యాణ మండపం షెడ్డు , శారద మండపం కల్యాణ కట్ట పనులు, కల్యాణం రేకుల షెడ్డు, ప్రసాద కౌంటర్ నిర్మాణ పనులు ఇంకా అలాగే ఉండిపో యాయి. అధికారులు, కాంట్రాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకుని సరస్వతి పుష్కరాల పనులు పూర్తి చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ముక్కోటి గొంతుకలు శోకతప్తం

(5వ పేజీ తరువాయి)

పాటల్లో కొన్ని. తనను ఆదరించి అక్కున చేర్చుకున్న ఓ తల్లి మరణించిన సందర్భంలో రాసిన ఽచూడ చక్కని తల్లి.. చుక్కల్లో జాబిల్లిఽ పాట గుండెల్ని పిండేస్తుంది. అందెశ్రీని కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

పలువురు సాహిత్యకారుల సంతాపం

అందెశ్రీ మృతి పట్ల ఓరుగల్లు సాహితీ లోక దిగ్భ్రాంతికి లోనయింది. ఆయన మృతి పట్ల పలువురు కవులు, రచయితలు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణ వార్త తెలియగానే హైదరాబాద్‌కు హుటాహుటిన తరలి వెళ్లారు. కడసారి కన్నీటితో వీడ్కోలు పలికారు. అం దెశ్రీతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వరంగల్‌లో జరిగిన పలు సాహితీ కార్యక్రమాల్లో ఆయనతో వేదిక పంచుకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనల పట్ల స్పందించి ఆశువుగా కవిత్వం చెప్పిన కవి పండితుడు అందెశ్రీ అని కాళోజి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి అన్నారు. ఆయన సాహిత్యానికి చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ ఫౌండేషన్ ప్రజాకవి పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ మృతి పట్ల ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కవులు పొట్లపల్లి శ్రీనివాస రావు, గంటా రామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, పందిళ్ల అశోక్ కుమార్, ఆగపాటి రాజ్ కుమార్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రాసిన అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ మృతి పట్ల సహృదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గిరిజన మనోహర్ బాబు, పోతన విజ్ఞాన పీఠం, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య హనుమకొండ అధ్యక్షుడు ఓడపల్లి చక్రపాణి, వరంగల్ అధ్యక్షుడు మాడిశెట్టి రమేష్, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఉపేంద్ర శర్మ, ఆర్య వైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేష్‌బాబు సంతాపం ప్రకటించారు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి కవులు, కళాకారులకే కాదు యావత్ తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు.

మానుకోటతో అనుబంధం

మహబూబాబాద్ టౌన్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజా కవి అందెశ్రీ మానుకోట జిల్లాకు అనేక మార్లు వచ్చి సభల్లో తన పాటల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి ఉద్యమం వైపు నడిపించారు. 2008, 2009లో రెండు పర్యాయాలు స్థానిక సమైక్య జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో జరిగిన పలు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2009 సంవత్సరంలో జిల్లాకు వచ్చిన సమయంలో కురవి వీరభద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్న గూడూరుకు వెళ్లి ప్రముఖ కవి దాశరధి కృష్ణమాచార్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పులకించిన జీడికల్

- కనులపండువగా సీతారాముల కల్యాణం
- మార్మోగిన రామనామ స్మరణ
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శ్రీహరి
- పెద్ద సంఖ్యతో తరలి వచ్చిన భక్తులు

లింగాలఘణపురం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండో భద్రాద్రిగా పేరుగాంచిన వీరాచల జీడికల్ పుణ్యక్షేత్రం.. సోమవారం కార్తీక మాస తిరుకల్యాణ మహోత్సవ వేళ 'భక్త'గిరిగా పోటెత్తింది. కార్తీకమాస పునర్వసు నక్షత్రాన జీడికల్‌లో బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా తిరుకల్యాణం కమనీయంగా సాగింది.. మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా స్వామివారిని పల్లకిలో మాడవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు. తిరుకల్యాణానికి ఉభయ వేదాంత ప్రవచకులు విజయసారథి ఆచార్య, శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో వేదపండితులు సంకల్పం చేసి సర్వ విఘ్న శాంతికోసం విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం తంతును నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా సీతారామచంద్రులకు రక్షసూత్రాలను తొడిగి జగత్కల్యాణార్థం మంత్రధార పూర్వకంగా కన్యాదానం చేశారు. దేవతామూర్తులకు జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని శిరస్సుపై పెట్టిన పండితులు మాంగళ్యపూజల నడుమ అమ్మవారికి స్వామివారి చేత మాంగళ్య దారణ చేయించి శుభలగ్న కైంకర్యాలను కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో 58 జంటల పుణ్యదంపతులు పాల్గొన్నారు.



తలంబ్రాలు, పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కడియం

పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే..

ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్ల నడుమ వేడుకలు జరిగాయి. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి జీడికల్ ఆలయాభివృద్ధికి రూ.2లక్షల విరాళం అందజేశారు.

కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీమ్ శర్మ, దేవస్థానం చైర్మన్ ఏలె మూర్తి, తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కె ట్ కమిటీ వైస్‌చైర్మన్ కొల్లూరు శివకుమార్, చిల్పూరు గుట్ట దేవస్థా నం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పోరెడ్డి మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది భరత్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు..

జనగామ జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రిభువనగిరి, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి హాజరైన అశేష భక్తజనుల నడుమ రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో చిందం వంశీ భారీ ఏర్పాట్లను చేపట్టారు. భక్తులు గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్టు దర్శనం కోసం బారులు తీరిన క్రమంలో ఎలాంటి తోపులాటలు జరగకుండా బారీకేడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, అత్యవసర వైద్య సదుపాయాలు, ఫైరింజన్, పోలీస్‌కంట్రోల్ రూమ్, హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీపీతో సహా ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సహా నలుగురు సీఐలు, ఎస్సై శ్రవణ్‌కుమార్ సహా ఎనిమిది మంది ఎస్సైలు, నలుగురు ఏఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లు, 25 మంది హోంగార్డులు, 25 మంది ఎన్‌సీసీ వలంటీర్లు విధుల్లో పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆధునిక సాధనాలతోనే పరిశోధనలు సాధ్యం

ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



ఆధునిక సాంకేతిక పరికరాల వివరాలు తెలుసుకుంటున్న బిద్యాధర్ సుబుధి, తదితరులు

హనుమకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనలను ప్రోత్సహించడంలో, సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ఆవిష్కరణలను పెంపొందించడంలో ఆధునిక విశ్లేషణాత్మక సాధనాలు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటాయని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ నిట్‌లో ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యాక్సెసబుల్ అనలిటకల్ టెక్నాలజీ (ఏఏటీ-25)పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నిట్ క్యాంపస్‌లో సాంకేతిక ప్రదర్శనను కూడా నిర్వహించారు. సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), థర్మోఫిషర్ సైంటిఫిక్, కీసైట్ టెక్నాలజీస్, నెట్‌వెబ్ టెక్నాలజీస్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. శాస్త్రీయ పరికరాల రంగంలో ప్రముఖ కంపెనీలు అయిన థర్మోఫిషర్ సైంటిఫిక్, కీసైట్ టెక్నాలజీస్, నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ కంపెనీలు తమ అత్యాధునిక, విశ్లేషణాత్మక సాంకేతికలతో తాజా పురోగతులను ప్రదర్శించాయి. వరంగల్ ఎన్ఐటీ, సమీప కళాశాలల నుండి అధ్యాపకులు, విద్యార్థులు సహా 150 మంది కిపైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీఆర్ఐఎఫ్ హెడ్ ప్రొఫెసర్ వీరేష్ బాబు, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కాశీనాథ్, ఈసీ విభాగం ప్రొఫెసర్ ఆంజనేయులు, సాంకేతిక అధికారులు గొల్లపల్లి రామ సంజీవిని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి భూములు ఇవ్వలేం..

మేడారం రైతుల నిరసన



తమ భూముల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తాడ్వాయి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయ అభివృద్ధికి అధికారులు అడుగుతున్న భూమిని తాము ఇవ్వలేమని ఆదివాసీ రైతులు సోమవారం తేల్చిచెప్పారు. దేవస్థానం వెనకాలగల 19ఎకరాల 27గుంటల భూమిని మాస్టర్ ప్లాన్ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే గతంలోనే రైతులతో మేడారంలో సమావేశమైన అధికారులు రైతులతో చర్చించినప్పటికీ సఫలం కాలేదు. మొత్తం 43 మంది రైతులు ఉండగా ప్రభుత్వ భూములు కలిగిన 16మంది రైతులను అధికారులు ఒప్పించి మిగతా వారిని కూడా ఒప్పుకునేలా ఇబ్బంది పెడుతున్నారని నిరసనకు దిగడం జరిగిందన్నారు. తాతలముత్తాత నుంచి జ్ఞాపకార్థంగా వస్తున్న భూములు కోల్పోవడం తమకు ఇష్టం లేదని వాపోతున్నారు. భూ సేకరణ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడారం పంట నష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు కృష్ణార్జున్, రైతులు రమేష్, జనార్దన్, యాదగిరి, దీపక్, పాపారావు, లక్ష్మణ్‌రావు, రామేశ్వరావు, సుధీర్, వినోద్, లక్ష్మణ్ తదితర రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో దీపోత్సవం

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయా ల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, వ్రతాలు, ఆచరించారు. సాయంత్రం దేవాలయాల్లో కార్తీక మాసం దీపోత్సవాలను నిర్వహించారు. చారిత్రక భద్రకాళి దేవాలయంలో పూజలు, దీపారాధనలు జరిపించారు. భద్రేశ్వరుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, బిల్వార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. -ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్



పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రాలు తిరుపతి, శ్రీశైలంకు వెళ్లే భక్తుల కోసం వరంగల్ -1 డిపోకు చెందిన హనుమకొండ బస్టాండ్ నుంచి ఏసీ రాజధాని బస్సులను ఏర్పాటు చేసినట్లు సోమవారం వరంగల్ ఆర్ఎం డి. విజయ భాను ఒక ప్రకటనలో తెలి పారు. నవంబరు 14 నుంచి ఆర్టీసీ ఏసీ బస్సులు ప్రత్యేక సర్వీసులు హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 8 .40 గంటలకు బయల్దేరి తిరు పతికి రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. అలాగే శ్రీశైలంకు హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి ఏసీ రాజధాని బస్సు శ్రీశైలంకు సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రేటర్ వరంగల్ ప్రయాణికులు, భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపు నిచ్చారు.

రుద్రేశ్వరుడికి భస్మ ధూళికాభిషేకం

- కార్తీక మాస మూడో సోమవారం విశేష పూజలు
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



హనుమకొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిలో కార్తీకమాసం మూడవ సోమవారం ప్రాతఃకాల ఉత్తిష్ఠ గణపతికి నవరసాలతో అభిషేకం నిర్వహించారు. రుద్రేశ్వర స్వామివారికి అంగన్యాస, కరన్యాసములతో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం 51 కిలోల భస్మంతో భస్మోధూలికాభిషేకం జరిపారు. 200 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. గజమాలతో రుద్రేశ్వరుడిని అలంకరించారు. సాయంత్రం భజన కార్యక్రమం, చతుర్వేద పారాయణం, నీరాజన మంత్ర పుష్పం, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో డి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాకు పింఛన్ ఇప్పించండి సారూ..

● కలెక్టర్‌కు తలసేమియా చిన్నారులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాకు పింఛన్ ఇప్పించండి సారూ.. అంటూ మహబూబాబాద్ గ్రీవెన్స్‌లో జిల్లాలోని తలసేమియా వ్యాధిగ్రస్తులు(చిన్నారులు) తల్లిదండ్రులతో కలిసి దరఖాస్తులు అందించారు. జిల్లాలోని పెద్దవంగర, గూడూరు. ఇనుగుర్తి, తొర్రూరు మండలాలకు చెందిన 10 మంది చిన్నారులు తలసేమియాతో బాధపడుతున్నారు. వారంతా తల్లిదండ్రులతో కలిసి తలసేమియా, సికిల్‌సెల్ పిల్లలకు దివ్యాంగుల పెన్షన్ ఇవ్వాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందించారు. దివ్యాంగుల బిల్లు-2016 చట్టాలను అమలు చేయాలని, అర్హులైన వారందరికి అంత్యోదయ కార్డులు అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, విద్య, ఉద్యోగ అవకాశాల్లో తలసేమియా వ్యాధిగ్రస్తులకు రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమావేశం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన విద్యుత్ ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్పీడీసీఎల్ వరంగల్ గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జాటోతు హర్షనాయక్ మాట్లాడుతూ.. గిరిజన విద్యుత్ ఉద్యోగులకు సమస్యలు ఏమైనా ఉంటే సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో 2026 నూతన డైరీని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంనాయక్, బానోతు రవి, హీరాలాల్, సునీతదేవి, రమేష్, యాకూబ్, సుమన్, హనుమా, మాలు పాల్గొన్నారు.

దేవాలయ ప్రధాన ద్వారం ఏర్పాటునకు పూజలు

డోర్నకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ పట్టణంలోని మున్నేరు వాగు ఒడ్డున నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి దేవాలయం వద్ద ప్రధాన ద్వారం ఏర్పాటునకు సోమవారం అంకురార్పణ జరిగింది. పూజారుల వేద మంత్రోచ్చరణల మధ్య ప్రధాన ద్వారంకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద దర్వాజను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా భక్తులు నవధాన్యాలు సమర్పించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు ఉండి ప్రతియేట తమకు పంటలు పండాలని భక్తులు వేడుకున్నారు. కార్యక్రమంలో శీలం శ్రీనివాస్, వాంకుడోతు వీరన్న, సకినాల వెంకన్న, సాదనాల వెంకటేశ్వర్లు, కేశబోయిన కోటిలింగం, దాసరి నాని, పచ్చిపాల మల్లేశం, దాసరి వెంకటేశ్వర్లు, మారబోయిన రాంభద్రం, రెడ్డబోయిన శంకర్, దేశబోయిన శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



సీతంపేటలో అభయాంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గార్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన పారిశ్రామిక వేత్త ఊరుకొండ శ్రీనివాస్‌రావు-విజయ దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన భారీ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని సీతంపేట గ్రామసమీపంలో గల గార్ల పెద్ద చెరువు అలుగు శివారులో ఏర్పాటు చేశారు. స్వామి వారి విగ్రహాన్ని వేదమంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 5వేల మందికి తీర్థప్రసాదాలు అందించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఊరుకొండ శ్రీనివాస్‌రావు-విజయ దంపతులు, బడిమే మురళీగౌడ్, మాలోత్ శివనాయక్, మాలోత్ భిక్షం, పర్సూరి వేంకటేశ్వర్లు, పర్సూరి సాయిబాబా, మాజీ సర్పంచ్ బానోత్ లావణ్య, రాజారావు, మేకల వెంకటేశ్వర్లు మొక్కులు చెల్లించుకున్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా కోశాధికారి నక్క నాగార్జునగౌడ్ అన్నారు. మహబూబాబాద్‌లోని జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా రూ.13 కోట్లు తక్షణమే విడుదల చేసి గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గీత వృత్తిదారులకు సభ్యత్వాలు, గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వృత్తి పరికరాలు, ద్విచక్ర వాహనాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో నీర కేంద్రాలను ఏర్పాటు చేసి గీతవృత్తి దారులకు జీవనోపాధి కల్పించాలన్నారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మంగ వెంకన్న, రాసమల్ల పెద్దవెంకన్న, బొమ్మకంటి ఎల్లయ్య, రాసమల్ల వీరన్న, బి.శ్రీను పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రథమ స్థానం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లిలో భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భారత్ కో జానో యువర్ ఇండియా క్విజ్ కాంపిటీషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మానుకోట విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం క్విజ్ పోటీల్లో 17 టీంలు పాల్గొనగా అందులో మానుకోట మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సదరు విద్యార్థులను మానుకోటలో సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్, బీవీపీ ప్రతినిధులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, వీవీ.నాగేందర్, జయప్రకాశ్ లోయ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

డోర్నకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం కోసం పోరాడి అమరులైన వారి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లింగన్న అన్నారు. డోర్నకల్ మండలం తహసీల్దార్ బంజరలో ఆదివారం రాత్రి అమరవీరుల సంస్మరణ సభ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీ నాయకులు నున్న పుల్లయ్య, మల్లిరెడ్డి ప్రతాప్‌రెడ్డి స్మారక స్థూపాల వద్ద జెండాలను నాయకులు యాస వెంకటనారాయణ, కర్న చిలుకరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో లింగన్న మాట్లాడుతూ.. భూమి.. భుక్తి.. దోపిడీ పీడనల విముక్తి.. పేద ప్రజల సంక్షేమం కోసం సాయుధ పోరాటం ఎంచుకుని ఎందరో విప్లవవీరులు అమరులయ్యారని చెప్పారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. రాందేని లక్ష్మణరావు, గుండు శ్రీనివాస్, గోసుల హనుమయ్య, యాప పిచ్చయ్య, రాఘవేందర్, ముత్తయ్య, రాసాల ఎల్లయ్య, ఉపేందర్, నాయిని వీరన్న పాల్గొన్నారు.

ఎఫ్‌వోబీ లేక ప్రయాణికుల ఇబ్బందులు

● తరచూ లూప్‌లైనులో నిలుస్తున్న గూడ్స్ రైళ్లు
● కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు
● రెండు నెలలుగా ప్రయాణికుల ఇక్కట్లు

కేసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో అప్ వైపు ప్లాట్‌ఫారంకు వెళ్లేందుకు ప్రయాణికులకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌వోబీ) లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఆరు నెలల క్రితం ఈ రైల్వేస్టేషన్ వద్ద మూడో రైల్వే లైను పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అంబేద్కర్ సెంటర్ వైపునకు



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో దిగి గూడ్స్ కింది నుంచి అమినాపురం వైపునకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మూడో నెంబరు ప్లాట్‌ఫారం మెయిన్ లైనుతోపాటు అదనంగా రెండు దిక్కులా ఉపయోగించే(బీడీ) లూప్‌లైను నిర్మాణం చేశారు. ఈ లూప్ లైనుకు మరోవైపు ప్లాట్ నిర్మాణం చేయలేదు. కేవలం ఎక్స్‌ప్రెస్ రైళ్లను పంపించేందుకు అప్, డైన్ వైపులా వచ్చే గూడ్స్ రైళ్లను పక్కకు నిలిపివేసేందుకే ఈ బీడీ లూప్ లైనును వినియోగిస్తారని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 16 నుంచి కొత్తగా నిర్మించిన మూడో లైనులో రాకపోకలు, బీడీ లూప్ లైనుపై రైళ్లను నిలపడం ప్రారంభించారు.

లూప్ లైనుపై గూడ్స్‌లతో తంటాలు..

కేసముద్రంలో నూతనంగా మూడో లైను వెంట నిర్మించిన బీడీ లూప్ లైనుతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. తరచూ ఈ లైనుపై గూడ్స్ రైళ్లు నిలుస్తుండడంతో అంబేద్కర్ సెంటర్, అమినాపురం వైపున ఉన్న కేసముద్రం, కల్వల, కోరుకొండపల్లి, ఇనుగుర్తి తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు రాకపోకల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడో నెంబరు ప్లాట్‌ఫారంలపై రైలు ఎక్కేందుకు, రైలు దిగిన ప్రయాణికులకు గూడ్స్ రైలు అడ్డుగా నిలిచి ఉండడంతో ప్రమాదభరితంగా కింద నుంచి దాటుతున్నారు. సెప్టెంబరు 16న రైల్వే ట్రాక్‌పై రాకపోకలు ప్రారంభించగా ఇక్కడ నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు మాత్రం నెమ్మదిగా సాగుతున్నాయి. దాదాపు రెండు నెలలుగా కాలినడక వంతెన లేక ప్రయాణికులు మరో వైపునకు వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి వెంటనే ప్రారంభించి ఇబ్బందులను తొలగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



కేసముద్రంలో నెలల తరబడి నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఫుట్ ఓవర్ బ్రిడ్జి వెంటనే ప్రారంభించాలి

– కొల్లూరు శ్రీనివాస్, వ్యాపారి, కేసముద్రం



కేసముద్రం అంబేద్కర్ సెంటర్, అమినాపురం వైపు నుంచి రైల్వేస్టేషన్ వెళ్లేందుకు అడ్డుగా తరచూ లూప్ లైనుపై గూడ్స్ రైలు అడ్డుగా ఉంటోంది. దీంతో చాలా మంది రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు గూడ్స్ దాటడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి.

గడ్డి మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

డోర్నకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన డోర్నకల్ మండలం కొత్తదుబ్బతండాలో ఆదివారం చోటుచేసుకుంది. డోర్నకల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై జమీల్ తెలిపిన వివరాల ప్రకారం... డోర్నకల్ మండలం కొత్తదుబ్బతండాకు చెందిన బాదావత్ కన్య(85) కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేక ఇబ్బందులు పడుతోంది. ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగగా గమనించిన కుమారుడు, కుటుంబసభ్యులు మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఆదివారం రాత్రి కన్య మృతి చెందింది. ఆమెకు కుమారుడు కశ్య ఉన్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని విద్యాభారతి గురుకుల పాఠశాలలో ట్రస్మా ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 66 జట్లు పాల్గొనగా, కబడ్డీలో జిల్లా కేంద్రంలోని గాదె రుక్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, ఖోఖోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేసముద్రం మండలకేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు సోమవారం టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, రూరల్ ఎస్సై దీపికారెడ్డి షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... క్రీడా రంగంలో మానుకోట జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా బాధ్యులు తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, చిర్ర యాకాంతంగౌడ్, ఆరుద్ర పరమాత్మచారి, బిక్కి వెంకటేశ్వర్లు, కమ్మగాని కృష్ణమూర్తి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్యాలలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

మహబూబాబాద్‌రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు దేవస్థాన నిర్మాణ ధర్మకర్తలు, గ్రామ మాజీ సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందురెడ్డి, ఎస్ఆర్ఐ వెన్నం విజయ్‌కాంత్‌రెడ్డి నేతృత్వంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6 గంటలకు అర్చకులు శ్రీకృష్ణ కిషోర్ త్రిపాఠి, శ్రీమన్ కిడాంబినర్సింహదేశికన్‌స్వామి వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణము, మంగళవాయిద్యాల ద్వారా యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనము, అంకురార్పణతో తొలిరోజు బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో నర్సింగం శ్రీనివాస్, సత్తిరెడ్డి, సోమయ్య, రమేష్, వెంకటయ్య, సురేందర్, వెంకన్న, దేవిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



రెడ్యాల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పూజలు చేస్తున్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డి–బిందురెడ్డి దంపతులు

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

● ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి, జిల్లా నిర్మాణ బాధ్యులు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సోమవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశాన్ని కందునూరి కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భారతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. జాతీయ మహాసభల్లో గత పోరాటాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి ప్రమీల, టౌన్ కార్యదర్శి శాగంటి భాగ్యమ్మ, బొల్లం మమత, దొంతు మమత, ఎల్లమ్మ, నాగమణి, సావిత్రి, ప్రమీల ఉపేంద్ర, అనిత, నాగమణి, రాధ, భవానీ, శోభ, రేణుక, రమాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి భారతి

అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటు



మహబూబాబాద్, తొర్రూరులో అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ బాధ్యులు, నాయకులు

మహబూబాబాద్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటని జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అన్నారు. ఆయన మృతి పట్ల సోమవారం సంతాపం ప్రకటించారు. మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్ నాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌లు మహాకవి అందెశ్రీ మృతికి తమ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోపక్క తెలంగాణ అస్థిత్వ గొంతుక అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని దళిత, బహుజన, రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక బాధ్యులు కోమాకుల సీతారాములు, సయ్యద్ ఖుర్షీద్, డాక్టర్ మద్దెర్ల రమేష్, కొమిరె వెంకన్న, వెంకట్రాంనర్సయ్య, నాగేశ్వర్‌రావు, ఐలయ్య అన్నారు.

● తెలంగాణ ఉద్యమానికి సాంస్కృతిక పునాది వేసిన అందెశ్రీ అశుకవి, ధిక్కార స్వరంతో అనునిత్యం దోపిడీ పాలకులను ప్రశ్నిస్తూ ప్రజల తరపున నిలబడి కలబడిండని ప్రముఖ విద్యావేత్త, నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్, జేఏసీ నాయకులు డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహాకవి అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని చెప్పారు.

● అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. మహబూబాబాద్‌లో టీపీటీఎఫ్ జిల్లా శాఖ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి అందెశ్రీ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీరాములు, వి.ఇందిర, ఆర్.భాగ్యలక్ష్మి, టి.రజిత, రచ్చ వెంకన్న, టి.రమేష్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్‌లో భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన శైలిలో పాటలు రాసి ప్రజలను ఉద్యమం వైపు నడిపించిన ప్రజాకవి అందెశ్రీ అని చెప్పారు. కార్యక్రమంలో తండా సదానందం, కొమిరె ఉప్పలయ్య, సోమ గోవర్ధన్, సైదులురెడ్డి, వీరస్వామి, ఆశయ, మల్లారెడ్డి, బాప్‌సింగ్, వీరన్న, హనుమంతు, కొమిరె వెంకన్న, ఇ.ఉప్పలయ్య, కె.వెంకన్న, రవి, బాద్యానాయక్, వహీద్, శంషుద్దీన్, రమేష్, నరేష్, బాలు పాల్గొన్నారు.

తెలంగాణ సమాజానికి తీరనిలోటు

తొర్రూరు(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి అందెశ్రీ అకాల మరణం తెలంగాణ సమాజానికి, ప్రజా సాహితీ ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం తొర్రూరు బస్టాండ్ వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. అందెశ్రీ రచనలు, గేయాలు తెలంగాణ మట్టి మనుషులను వెన్నుతట్టి లేపాయని, సమాజంలో నూతన జవసత్వాలు నింపి రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా పనిచేశాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో వీరన్న, వెంకన్న, సోమయ్య, నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

దంతాలపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై గల దంతాలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రాజు మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి వస్తున్న ఏపీ 02 టీసీ 2893 నెంబర్ గల లారీ వరంగల్ వైపు వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు తనిఖీ చేసి 30 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు చెప్పారు. లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. క్లీనర్‌ను అదుపులోకి తీసుకోగా, డ్రైవర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కాగా, బియ్యం లారీని దంతాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

▸▸ గ్రీవెన్స్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై అందజేసిన 84 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. శాఖల్లో ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదనరాజు, విజయనిర్మల, వెంకటేశ్వర్లు, నర్సింహమూర్తి, మరియన్న, డాక్టర్ కిరణ్‌కుమార్, వేముల సురేష్, కృష్ణవేణి, సబిత, శ్రీనివాస్, దేశీరాం నాయక్, విజయ, రజిత, మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

● బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నేత కుమార్



మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న బీసీ హక్కుల సాధన సమితి నేతలు

మహబూబాబాద్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లపై ప్రధాని మోదీతో ఇంత వరకు మాట్లాడని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబద్కేర్‌విగ్రహం ఎదుట బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... బీసీల రిజర్వేషన్ 42 శాతం పెంపు అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించాలని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఇంతవరకు దానిపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తూ బీసీలకు అన్యాయంచేస్తుందని దుయ్యబట్టారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రధాని మోదీని ఒప్పించలేని తెలంగాణ బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దకేంత వరకు పోరాటాలు ఆగవని పేర్కొన్నారు. రేషపల్లి నవీన్, మేక వీరన్న, జలగం ప్రవీణ్, నక్క నాగార్జున, గాదె శ్యాంప్రసాద్, సత్యం, రమేష్, వెంకటేష్, రాజు, యాకయ్య, చరణ్, మోహన్‌రావు, ఓంప్రకాశ్‌పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పోలింగ్‌పై
మానుకోటలో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు నివాస గృహంపై దాడులు చేయడం.. అక్కడ ఏమీ దొరక్కపోవడం లాంటివి మహబూబాబాద్ పొలిటికల్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇంకేముంది బీఆర్ఎస్ శ్రేణుల్లో తమ అభ్యర్థి గెలుపు అవకాశం ఉండడం వల్లే ఇలా నాయకుల ఇళ్లపై అధికార కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేయడానికి దాడులకు పూనుకున్నట్లు ప్రచారం చేస్తూ గెలుపు అవకాశాలు తమకే ఉంటాయంటూ కొందరు బెట్టింగ్‌లకు దిగుతున్నారు. అధికార కాంగ్రెస్ నాయకులు కూడా తామేం తక్కువ కాదంటూ బీఆర్ఎస్ గెలిస్తే స్థానిక ఎన్నికల్లో ఫలానా.. ఫలానా చోట్ల తాము పోటీకే దిగమంటూ సవాల్ విసురుతున్నారు. ఓడిపోతే విపక్ష అభ్యర్థులు రాజకీయాల నుంచి వైదొలగాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి అధికార, విపక్షాలకు చెందిన చోటా.. మోటా నాయకులు చిన్న మొత్తాలు మొదలుకుని పెద్ద ఎత్తునే పందాలు కాస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మంగళవారం పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా పార్టీల ఔత్సాహిక యువ రాజకీయవేత్తలు ప్రత్యేక విడుదులు ఏర్పాటు చేసుకుంటూ మందు, విందులతో టీవీ వీక్షణ ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. మరికొందరు ముఖ్య యువనేతలైతే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్ నియోజకవర్గయేతర ప్రాంతాల్లోని హోటళ్లను బుక్ చేసుకుని అక్కడే పోలింగ్ సరళి తెలుసుకున్నాకే స్వస్థలంకు రావాలనే ఆలోచనలో ఉన్నట్లు వినికిడి. మొత్తానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మహబూబాబాద్ జిల్లా రాజకీయాల్లో హీటెక్కిస్తోంది.